సాక్షి
నల్లగొండ
బుధవారం । 24 । మే । 2023



**యాదాద్రిలో జుగాను వెలుగులు!**
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జుగాను వెలుగులు విరజిమ్మేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. - 8లో



**ఆధార్ అప్‌డేట్**
ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మరో మారు అవకాశం కల్పించింది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40°/27°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పంచాయతీలకు పెండింగ్ బిల్లులు విడుదల

నల్లగొండ : ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులను మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1190 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇందులో నల్లగొండ జిల్లాకు రూ.40 కోట్ల వరకు విడుదలయ్యే అవకాశం ఉంది. గతేడాది నవంబర్ వరకు ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను సమర్పించగా వాటన్నింటికీ నిధులు మంజూరు చేసింది. అయితే డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి బిల్లులు ట్రెజరీలోనే పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం వాటిని విడుదల చేసినట్లు ప్రకటించారు. దీంతో జిల్లాకు రూ.40 కోట్ల పైచిలుకే వచ్చే అవకాశం ఉంది.

### ముగ్గురు ఆర్డీఓలు బదిలీ

నల్లగొండ : ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఆర్డీఓలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి తుప్రాన్ ఆర్డీఓగా బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న శ్యాంప్రకాష్ నల్లగొండ ఆర్డీఓగా రానున్నారు. అదేవిధంగా దేవరకొండ ఆర్డీఓ గోపీరాం ఆంథోల్ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. కాగా హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డి జహీరాబాద్‌కు బదిలీ అయ్యారు.

### మెరుగైన ర్యాంక్ సాధించేలా వసతులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీకి న్యాక్‌లో మెరుగైన ర్యాంక్ సాధించేందుకు అన్ని వసతులు కల్పించినట్లు యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ బృందం ఈనెల 24, 25, 26 తేదీల్లో యూనివర్సిటీలోని వసతులు, గత ఐదేళ్ల విద్యా కార్యక్రమాలను పరిశీలిస్తుందని తెలిపారు. న్యాక్ గుర్తింపుతోనే యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వస్తుందని, ఫలితంగా విద్యార్థులకు గుర్తింపు గౌరవం ఉంటుందని పేర్కొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టూటౌన్ : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీపగడ కోటయ్య స్మారక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ ఏడీ ద్వారక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ అభ్యర్థులు 15 నుంచి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 25 సంవత్సరాలలోపు వారు ఈనెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు www.iihtvgr.com వెబ్‌సైట్ చూడాలని తెలిపారు. ఇతర వివరాలకు 93999 36872 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### 25న చెస్ అసోసియేషన్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 25న నల్లగొండలోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొనసం కరుణాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు, చెస్ క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు 995423823 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### మైనార్టీ విద్యార్థులకు మాక్ టెస్టులు

రామగిరి(నల్లగొండ) : గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు ప్రిపేరయ్యే మైనార్టీ (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీకులు) విద్యార్థులకు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 25న, జూన్ 1, 8వ తేదీల్లో ఆన్‌లైన్ మాక్ టెస్టులు నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి గోశిక బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఈనెల 24 తేదీలోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94943 45471 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 25న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 25న నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలోని నాయకులు, పదాధికారులు హాజరు కావాలని కోరారు.

# సివిల్స్‌లో అదరగొట్టారు



ఉమాహారతి

- హుజూర్‌నగర్‌కు చెందిన ఉమాహారతికి 3వ ర్యాంకు
- ఐదవ ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకున్న ఎస్పీ కూతురు
- పిల్లల వైద్యుడు దామెర యాదయ్య కుమారుడు హిమవంశీకి 548 ర్యాంకు

**హుజూర్‌నగర్, నల్లగొండ టౌన్ : యూపీఎస్సీ మంగళవారం వెల్లడించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు విజయకేతనం ఎగురవేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్‌కు చెందిన నూకల వెంకటేశ్వర్లు, శ్రీదేవిల కుమార్తె ఉమాహారతి ఆల్‌ఇండియాలో 3వ ర్యాంకు సాధించగా.. నల్లగొండ పట్టణానికి చెందిన పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ దామెర యాదయ్య, నిర్మల దంపతుల కుమారుడు హిమవంశీ 548 ర్యాంకు సాధించారు.**

ఉమాహారతి హైదరాబాద్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివారు. హైదరాబాద్ ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం సివిల్స్‌కు కోచింగ్ తీసుకుని పరీక్షలు రాశారు. తన నాలుగో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. ఇప్పుడు ఐదో ప్రయత్నంలో ఆలిండియా 3వ ర్యాంక్ సాధించి జాతీయ స్థాయిలో సత్తాచాటారు. ఆమె తమ్ముడు సాయివికాస్ ఐఈఎస్ (ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో ఆల్ ఇండియా 12వ ర్యాంకు సాధించి ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆయన ముంబైలో ఈ నెల 22న ఉద్యోగంలో చేరారు. ఉమాహారతి తండ్రి నూకల వెంకటేశ్వర్లు నారాయణపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. వెంకటేశ్వర్లు స్వగ్రామం హుజూర్‌నగర్. వెంకటేశ్వర్లు తండ్రి నూకల సైదులు తెలుగు పండిట్. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు కాగా ఒకరు ప్రైవేటు ఉద్యోగి.

**ఎంపీ, కలెక్టర్ శుభాకాంక్షలు**

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమాహారతికి శుభాకాంక్షలు తెలిపారు. దేశసేవలో మరింత ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు కూడా ఉమాహారతికి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ వెంకట్రావు.. ఉమాహారతి తండ్రి, ఎస్పీ వెంకటేశ్వర్లకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. గతంలో వీరిద్దరు కలిసి మహబూబ్‌నగర్‌లో పనిచేసిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, శ్రీదేవితో ఉమాహారతి

**కుటుంబం సపోర్టు చాలా ముఖ్యం**

ఈ పరీక్ష ప్రక్రియలో చాలా ఫెయిల్యూర్స్ చూశాను. కానీ, ఆత్మవిశ్వాసంతో చదువుతూ వెళ్లాను. ఏదో ఒక ర్యాంకు వస్తే చాలనుకున్నా. మూడో ర్యాంకు వస్తుందని అస్సలు ఊహించలేదు. రోజూ ఏడెనిమిది గంటల పాటు చదివేదాన్ని. ముందుగా జాగ్రఫీ ఆప్షనల్ సబ్జెక్టు ఉండేది. ఆ తర్వాత ఆంత్రోపాలజీకి మారాను. ఒకవేళ పరీక్షల్లో ఫెయిల్ అయినా నిరాశ పడొద్దు. ఎంత కష్టపడితే అంత ఫలితం పొందవచ్చు. నేను ఐదేళ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నా. ఈ ప్రాసెస్‌లో కుటుంబ సభ్యుల సపోర్టు చాలా అవసరం. పరీక్షకు సంబంధించిన సమాచారం, పుస్తకాలు అన్నీ ఆన్‌లైన్‌లో ఉచితంగా దొరుకుతాయి. మహిళలు, పురుషులు ఎవరైనా సరే కుటుంబం సపోర్టు చేస్తే ఏదైనా సాధించవచ్చు. నేను ఐఐటీ హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేశాను. ఆ తర్వాత ఉద్యోగంలో చేరలేదు. సివిల్స్ వైపు వెళ్లాలని ముందునుంచీ ఉండటంతో దానిపైనే పూర్తిగా ఫోకస్ పెట్టాను. నా తల్లిదండ్రులు కూడా చాలా సపోర్టు చేశారు. నూటికి నూరు శాతం మా నాన్నే నాకు స్ఫూర్తి, ప్రేరణ.

-ఉమాహారతి

## పేదలకు సేవ చేయాలని..

నల్లగొండ పట్టణానికి చెందిన దామెర హిమవంశీ ఐదో ప్రయత్నంలో 548వ ర్యాంక్ సాధించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ దామెర యాదయ్య, నిర్మల దంపతుల ఏకైక కుమారుడైన హిమవంశీ పదవ తరగతి వరకు నల్లగొండలో, ఇంటర్ హైదరాబాద్‌లో చదివారు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీ ఐఐటీలో ఎంటెక్ 2018 సంవత్సరంలో పూర్తి చేశారు. ఆ తరువాత సివిల్ సర్వీస్‌పై దృష్టిసారించారు. కోచింగ్ ఏమీ తీసుకోకుండా స్వతహాగానే ప్రిపేర్ అయ్యారు. ఐదవ ప్రయత్నంలో సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఐపీఎస్ గానీ ఐఆర్‌ఎస్ గానీ వచ్చే అవకాశం ఉన్నట్లు హిమవంశీ చెప్పారు.

**ఐఏఎస్ సాధించడమే లక్ష్యం**

డాక్టర్‌గా తన తండ్రి యాదయ్య అందిస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుని సివిల్ సర్వీస్ ఎంపికై ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు హిమవంశీ తెలిపారు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సివిల్స్ ర్యాంకు సాధించానన్నారు. ప్రస్తుతం ఐపీఎస్ గానీ, ఐఆర్‌ఎస్ వస్తే జాయిన్ అయిన తరువాత కూడా ఐఏఎస్ సాధించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. నిరుపేదలకు న్యాయం చేయాలంటే సివిల్ సర్వీస్‌తోనే సాధ్యమవుతుందన్న ఆలోచనతో తాను అటువైపు దృష్టిపెట్టినట్లు తెలిపారు. కాగా, హిమవంశీకి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అభినందనలు తెలిపారు.



హిమవంశీకి స్వీటు తినిపిస్తున్న డాక్టర్ యాదయ్య, నిర్మల దంపతులు

## న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని వైద్య అధికారులకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళా ఆరోగ్య కేంద్రం రెఫరల్ యూనిట్‌ను కలెక్టర్.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి తనిఖీ చేశారు. ఆసుపత్రిని స్టోర్ రూంలో న్యూట్రిషన్ కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా దినోత్సవం రోజున ప్రారంభించిన ఆరోగ్య మహిళా కేంద్రాలు నుంచి ఎంత మందిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేశారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల్లో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉండేలా.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హెల్త్ డే నిర్వహించి న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మహిళా ఆరోగ్య కేంద్రం రెఫరల్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

**ఐదు భవనాల నిర్మాణం పూర్తి**

నల్లగొండ : జిల్లాకు 84 పల్లె దవాఖానాలు మంజూరు కాగా ఇప్పటికే 5 భవనాలు నిర్మాణం పూర్తి చేశామని.. 8 తుది దశలో ఉన్నాయని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి చేస్తున్న ఏర్పాటు, పల్లె దవాఖాల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. పల్లె దవాఖానకు సంబంధించిన కొన్ని టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు.



## రాష్ట్రంలో అతి పెద్ద క్రీడా సంబురం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆంజనేయులు గౌడ్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం కప్ పోటీలతో రాష్ట్రంలో అతి పెద్ద క్రీడా సంబురం సాగుతోందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన తిలకించారు. మొదట క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.ఎమ్మెల్యే కంచర్ల, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిలతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను వెలికి తీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ నిరూపించుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోటీల్లో లక్షన్నర మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, పీఈటీలు విమల, కవిత, గిరిబాబు, కె.కర్నాకర్‌రెడ్డి, ఇమామ్ కరీం పాల్గొన్నారు.

## 25 నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట వేదికగా ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ యూత్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు వసతి, భోజన సౌకర్యాలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సహకారంఅందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 40జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. అండర్ –16 విభాగంలో జరిగే ఈ పోటీలకు బాలబాలికలతో సహా మొత్తం 600 మంది వరకు ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాల మైదానంలో జరుగుతున్న సీఎం కప్ పోటీలను తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఫారూఖ్, డీఎస్పీ నాగభూషణం, నాయకులు ఉప్పల ఆనంద్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : పొరపాట్లు లేని ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కీలకమైనదని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపొందించడంలో ఓటరు జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్లకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఏ సత్యనారాయణ, నర్సిరెడ్డి, లింగస్వామి, ఎస్‌కె.మోయిన్, బి.పిచ్చయ్య, రవీందర్, వి.యాదగిరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎన్నికల డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

## నా కల నెరవేరింది



బి.వెల్లెంల ప్రాజెక్టు వద్ద కృష్ణా జలాలకు పూజలు చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న కోమటిరెడ్డి

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్ద కోమటిరెడ్డి 60వ జన్మదిన వేడుకలు

నార్కట్‌పల్లి : బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు సాకారం అవుతుండటంతో తన కల నెరవేరిందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు వద్ద కృష్ణా జలాలలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తన 60వ జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి తన అభిమానాన్ని చాటారని, వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనన్నారు. బతికుండగానే కాకుండా చనిపోయాక కూడా ప్రజలు గుర్తుపెట్టుకునేలా సేవ చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. తన ప్రాణం కంటే పార్టీ కార్యకర్తలే తనకు ముఖ్యమన్నారు. బ్రహ్మణవెల్లెంలకు కృష్ణా నీళ్లు రావడం సంతోషంగా ఉందన్నారు. పానగల్ నుంచి కృష్ణమ్మకు సారెను సమర్పించానన్నారు. వైకుంఠధామాలు, ఫాంహౌజ్‌లు కట్టుకుంటే నాయకులు కాలేరని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. బ్రహ్మణ వెల్లంలలో కృష్ణమ్మ నీళ్లు చూసి డాన్స్ వేశాను తప్ప తన పుట్టిన రోజుకు కాదన్నారు. భవిష్యత్‌లో ఏ స్థాయిలో ఉన్నా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి మారడని, మరో జన్మంటూ ఉంటే ఇక్కడే పుట్టాలని కోరుకుంటున్నానని చెప్పారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. నార్కట్‌పల్లి నుంచి భారీగా కార్లు, బైకుల కాన్వాయితో ప్రాజెక్టు వరకు చేరుకున్నారు. కార్యక్రమంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్‌నాయక్, కుంభం అనిల్‌రెడ్డి, సూర్యాపేట కాంగ్రెస్ నాయకుడు పటేల్ రమేష్‌రెడ్డి, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు దైద రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, దార యాదయ్య, నేతగాని కృష్ణ, శశిదర్‌రెడ్డి, ధర్మయ్య, స్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా రెండు పీఆర్ డివిజన్లు

- పంచాయతీరాజ్ శాఖను పునర్‌వ్యవస్థీకరిస్తూ జీఓ విడుదల
- దేవరకొండలో పీఆర్ డివిజన్, నల్లగొండ క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఏర్పాటు
- మిర్యాలగూడకు రానున్న క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్
- కొత్త కార్యాలయాలతో పెరగనున్న పోస్టులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు

నల్లగొండ : పంచాయతీ రాజ్ (పీఆర్) ఇంజనీరింగ్ శాఖను పునర్‌వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో కొత్తగా రెండు డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. దేవరకొండలో పీఆర్ డివిజన్, నల్లగొండలో క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఏర్పాటు, మిర్యాలగూడలో ఒక క్వాలిటీ కాంట్రోల్ సబ్ డివిజన్ కూడా ఏర్పాటు కాబోతుంది. నాంపల్లి, పెద్దవూర, పెద్దఅడిశర్లపల్లి దామరచర్లలో పీఆర్ సబ్ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో ప్రస్తుతం ఉన్న సర్కిల్ కార్యాలయంతోపాటు మూడు పీఆర్ సబ్ డివిజన్లు, ఒక క్వాలిటీ కంట్రోల్ డివిజన్, 12 పీఆర్ సబ్ డివిజన్లు, మరో రెండు క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ల ద్వారా కార్యకలాపాలు సాగనున్నాయి. ప్రస్తుతం కొత్తగా కార్యాలయాలు ఏర్పడి పోస్టులు పెరుగుతాయి. దీంతో పదోన్నతులు కూడా వస్తాయని అధికారుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

**జీఓ విడుదల**

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం తండాలను, గూడేలను గ్రామపంచాయతీలుగా చేయడంతోపాటు మండలాలు, జిల్లాల సంఖ్యను కూడా పెంచిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఇప్పటికే నీటిపారుదల శాఖతోపాటు రోడ్డు భవనాల శాఖను పునర్‌వ్యవస్థీకరణ చేసింది. తాజాగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖను కూడా రీ ఆర్గనైజేషన్ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతోపాటు జీఓ కూడా విడుదల చేసింది.

**నల్లగొండ జిల్లాకు ప్రత్యేకంగా..**

జిల్లాలో ప్రస్తుతం రెండు పంచాయతీరాజ్ డివిజన్లు నల్లగొండ, మిర్యాలగూడ ఉన్నాయి. ఒక క్వాలిటీ కాంట్రోల్ సబ్ డివిజన్ ఉంది. జిల్లా కేంద్రంలో సర్కిల్ ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాల పరిధిలోని మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాకు కలిపి క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఉండేది. ఇప్పుడు నల్లగొండ జిల్లాకే ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోట్ డివిజన్ ఏర్పాటు కాబోతోంది.



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు

**ఇప్పటికే 10 ఏఈ పోస్టులు ఖాళీ..**

ప్రస్తుతం జిల్లాలో 25 ఏఈ పోస్టులు ఉంటే. 10 చోట్ల ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలాలు ఏర్పాటు చేసిన సందర్భంలో ఏఈ పోస్టుల సంఖ్య కూడా పెరిగింది. కానీ, పోస్టులు భర్తీ కాలేదు. దీంతో ఖాళీల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం రీఆర్గనైజేషన్ వల్ల కొత్తగా పోస్టులు పెరగనున్నాయి. వీటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తే కింది స్థాయిలో ఏఈ పోస్టులు మరింత ఖాళీ అయ్యే అవకాశం ఉంది. భర్తీ చేయకపోతే పదోన్నతులు వచ్చిన అధికారులే కిందిస్థాయి పోస్టుల్లో విధులు నిర్వహించాల్సి వస్తుంది.

**ఎంతో సంతోషంగా ఉంది**



పంచాయతీరాజ్ శాఖను రీ ఆర్గనైజేషన్ చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రితోపాటు అందుకు సహకరించిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీష్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, సీఎస్‌కు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ధన్యవాదాలు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కొత్తగా పోస్టులు పెరగడంతోపాటు పదోన్నతులు కూడా రానున్నాయి.

– తిరుపతయ్య, పంచాయతీరాజ్ ఈఈ

## క్లుప్తంగా

### వడదెబ్బతో వృద్ధురాలు మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంక్‌తండా ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన కొర్ర లక్ష్మి(70) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. కాగా, ఎండ తీవ్రతకు సోమవారం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండకు తీసుకెళ్లగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.మృతురాలికి ముగ్గురు సంతానం. మృతురాలి కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆయన వెంట నాయకులు వానరాసి సింహాద్రి, దాసర్ల దుర్గమ్మ, వల్లబట్ల వెంకన్న, రాజు, రామలింగం, తులసి, కోటమ్మ, మల్లేశ్వరి, లింగయ్య, జ్యోతి, స్వాతి, తులసి ఉన్నారు.

### పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చిట్యాల: జాతీయ రహదారిపై చిట్యాలలో మీదుగా తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రి నుంచి హైదరాబాద్ వైపునకు టాటా ఇంట్రా వాహనంలో తరలిస్తున్న తొమ్మిది ఆవులను చిట్యాలలోని రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఈ వాహనంలో ఒక ఆవు మృతి చెంది ఉండగా మరో ఎనిమిది ఆవులను చండూర్‌లోని గోశాలకు తరలించారు. పశువులను రవాణా చేస్తున్న రాజమండ్రికి చెందిన చదలవాడ హేమంత్, టాటా ఇంట్రా వాహన యజమాని దేవదాసు రాజ్‌కుమార్, పశువుల రవాణాకు సహకరించిన అల్తాఫ్ ఖురేషీ, వైబోయిన అప్పల కొండ, దేవర బాజీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన తరుణ్‌తేజ్

పాలకవీడు: కుక్కల దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పాడ్యాతండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడిత్య వెంకట్రాం కుమారుడు తరుణ్‌తేజ్(8) వీధిలో ఆడుతుండగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన గ్రామస్తులు కుక్కలను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. బాలుడికి చేతులు, కాలు, పొట్టపై గాయాలవడంతో ఆస్పత్రికి తరలిచారు. గ్రామంలో వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆధార్ అప్‌డేట్!

- కార్డు పొంది పదేళ్లు దాటితే అప్‌డేట్ చేసుకోవాల్సిందే..
- ప్రభుత్వ ఉచిత సేవలకు జూన్ 14 వరకు గడువు
- లేదంటే సంక్షేమ పథకాలు కట్ అయ్యే అవకాశం


కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ నమోదు చేయించుకుంటున్న ప్రజలు

చిట్యాల, దురాజ్‌పల్లి(సూర్యాపేట): ప్రభుత్వ శాఖల్లో ఏ చిన్న పనికైనా ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆస్తుల క్రయవిక్రయాలు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు.. విద్యాపరంగా సీట్లు పొందాల న్నా ఆధారే కీలకంగా మారింది. ఆధార్ కార్డులను జారీని 2010లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మరోమారు ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోనేందుకు ఉచితంగా అవకాశం కల్పించింది. ఈ సేవలను వినియోగించుకునేందుకు జూన్ 14వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంది. ఆధార్ కార్డును నిర్ణీత వ్యవధిలో అప్‌డేట్ చేసుకోనట్లయితే భవిష్యత్తులో సస్పెండ్ అయ్యే అవకాశం ఉంది.

**సంక్షేమ పథకాలకు..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఆధార్ వివరాలు సక్రమంగా ఉన్నాయా.. లేవా.. అని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం ఆధార్ తీసుకోవడం, ఆ సమయంలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం, వేలిముద్రలు అరిగిపోవడం వంటి కారణాలతో పథకాలకు అర్హులైనవారు దూరమవుతున్నారు. ఒకరి ఆధార్‌కు బదులుగా మరొకరి ఆధార్ నంబర్ నమోదు కావడం వంటి సమస్యలు కూడా అనేకం ఉన్నాయి.

**చిన్నారులకు విధిగా..**

నెలల వయసున్న వారి నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు విధిగా ఆధార్ నమోదు చేయించాలి. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే అన్నిరకాల వసతులకు ఆధార్ తప్పనిసరి చేయడమే ఇందుకు కారణం. ఆధార్ లేనివారికి పూర్తిస్థాయి పౌష్టికాహారం అందించలేని పరిస్థితి నెలకొంటుంది.

**పెద్దల్లో వీరికి అవసరం**

2010 నుంచి 2018 వరకు ఆధార్ నమోదుదారుకి కార్డుపై పేరుతో పాటు తండ్రి, భర్త అనే విధంగా వారి మధ్య ఉన్న బంధుత్వం ముద్రితమై ఉంటుంది. 2018 తరువాత వాటిని తొలగించి కేవలం కేరాఫ్ పేర్కొంటూ కార్డులు జారీ చేశారు. ఇలాంటి వారు బంధుత్వం లేకుండా కేరాఫ్ పడేలా నవీకరించుకోవాలి. 2009లో ఆధార్ ప్రారంభమైన సమయంలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయలేదు. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందుపరుస్తూ నవీకరణ చేసుకోవాలి.

### అప్‌డేట్ చేసుకోండిలా..

❖ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు మై ఆధార్ పోర్టల్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

❖ దీనిలో భాగంగా కంప్యూటర్‌లో, సెల్‌ఫోన్‌లలో 'మై ఆధార్ పోర్టల్' లో ఎం-ఆధార్ యాప్ ద్వారా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇందుకు ఆధార్‌కార్డులకు లింకు ఉన్న సెల్‌నంబర్ గల మొబైల్స్‌లను మాత్రమే వినియోగించాలి.

❖ మొదటగా మై ఆధార్, యూఐడీఏఐ జీవోవీ.ఇన్ తెరిచి ఆధార్ నంబరు నమోదు చేసుకోవాలి.

❖ అనంతరం ఆధార్‌కు అనుసంధానం అయిన సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీతో లాగిన్ కావాలి.

❖ మార్పులు చేయాలనుకున్న వారు డాక్యుమెంట్ అప్‌డేట్ అనే ఆప్షన్ పై క్లిక్ చేయాలి.

❖ పేరు ఇతర వివరాలు, రుజువు చేస్తూ తగిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.

❖ మన అడ్రస్ రుజువూ చూపుతూ మరో పత్రం అప్‌లోడ్ చేసి సబ్‌మిట్ చేయాలి.


❖ చిరునామా ధ్రువీకరణ పత్రాలుగా ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా బుక్‌లలో ఏదో ఒకటి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

# యాదాద్రిలో జుగాను వెలుగులు!

- ఇజ్రాయిల్ నుంచి రానున్న ప్రత్యేక ఆకర్షణ విద్యుత్ దీపాలు
- ఆలయాన్ని సందర్శించిన జుగాను లైట్ పరిశ్రమ యజమాని అలెక్స్
- ఈఓ కార్యాలయం ఎదుట ట్రయల్ రన్ చేసిన అధికారులు


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జుగాను లైట్ పరిశ్రమ యజమాని అలెక్స్ తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధునాతన పద్ధతిలో వెలుగులు వచ్చేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వైఫైతో విద్యుత్ కాంతులతో పాటు అందులోనే సౌండ్ సిస్టమ్, కెమెరాలు ఉండనున్నాయి. ఇందులో భాగంగా ఇజ్రాయిల్‌కు చెందిన జుగాను లైట్ పరిశ్రమ యజమాని అలెక్స్, ఇండియా హెడ్స్ కిరణ్, కీర్తిదేశాయ్‌లు ఆలయాన్ని సందర్శించారు. వీరి వెంట ఈసీఐఎల్ ప్రతినిధులు శాంతయ్య, వేణు, రవీందర్‌రెడ్డి ఉన్నారు. ఎక్కడెక్కడ ఈ జుగాను విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలనే అంశాలను పరిశీలించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి తీసుకువచ్చిన పసిడి వర్ణం కాంతులు ఇప్పటికే భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఇజ్రాయిల్ కంపెనీ జుగాను విద్యుత్ దీపాలు కూడా ఆకట్టుకోనున్నాయి. రాయగిరి నుంచి ప్రధాన రహదారి, రింగ్ రోడ్డు, ఘాట్‌రోడ్డు, యాదాద్రి ఆలయ పరిసరాల్లో ఈ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయనున్నారు. 300 కెమెరాలు ప్రతి 150 మీటర్ల దూరానికి ఒకటి జుగాను విద్యుత్ దీపాలను బిగించనున్నారు. నెల రోజులలోపు ఈ విద్యుత్ దీపాల బిగింపు పూర్తిచేయనున్నట్లు సంబంధిత అధికారి రామారావు వెల్లడించారు. వైఫై ద్వారా ఈ విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, సౌండ్ సిస్టమ్ ఉండే దీపాలను కొండపైనే ఉన్న కమాండో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈవో కార్యాలయం ఎదుట ఈ విద్యుత్ దీపాన్ని బిగించి ట్రయల్ రన్ చేసినట్లు చెప్పారు.


ఈఓ కార్యాలయం ఎదుట ట్రయల్ రన్ చేసి వెలిగించిన జుగాను లైట్

# జాతీయ రహదారిపై దోపిడీ

- వాహనాన్ని ఆపి డబ్బులు డిమాండ్
- ఫోన్ పేకు రూ.10వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న దోపిడీదారులు
- చౌటుప్పల్ మండలం రెడ్డిబావి గ్రామస్టేజీ వద్ద ఘటన
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

చౌటుప్పల్ : జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాన్ని ఆపి ఓ ఇద్దరు యువకులు దారి దోపిడీకి పాల్పడ్డారు. నగదు లేదని చెప్పినా వినిపించుకోకుండా ఫోన్‌పేకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో ఫోన్ పే నంబర్ ఆధారంగా నిందితులు పోలీసులకు చిక్కారు. ఈ ఘటన సోమవారం రాత్రి చౌటుప్పల్ మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్‌రావు, తన కుమారుడు అఖిల్ కలిసి హైదరాబాద్ నుంచి బొలేరో వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో రెడ్డిబావి గ్రామస్టేజీ వద్ద మండల పరిధిలోని పంతంగి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బొలేరో వాహనాన్ని ఆపారు. వారిలో నక్క లింగస్వామి ఓ పత్రికా విలేకరినని, శ్యామల శ్యాంప్రసాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా చెప్పుకున్నారు. బొలేరోలోని తండ్రి, కుమారుడిని బెదిరించడం ప్రారంభించారు. డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. తమ వద్ద నగదు లేదని చెప్పినా విన్పించుకోలేదు. అదే సమయంలో బాధితుల నుంచి బలవంతంగా ఫోన్‌పే ద్వారా తమ ఖాతాకు రూ. 10వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయమై బాధితుడు వెంకటేశ్వర్‌రావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ పే నంబర్ ఆధారంగా విచారణ నిర్వహించిన పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయవాదిపై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

తిరుమలగిరి: న్యాయవాదిపై దాడి కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం శివారు వద్ద ఈ నెల 20న న్యాయవాది పెరైపాటి యుగేందర్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో కందుకూరి ప్రవీణ్, అక్కెనపల్లి నాగరాజు, ఋషిపాక ఉదయ్‌కుమార్, బోనేపల్లి నాగరాజు, ఎర్ర గణేష్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

నూతనకల్ : విద్యుదాఘాతంతో విద్యుత్ ఉద్యోగికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని యడవెల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన తన్నీరు కృష్ణ విద్యుత్ శాఖలో ఆర్టీజన్‌గా విధులు నిర్వరిస్తున్నాడు. గ్రామ శివారులోని ట్రాన్స్‌పార్మర్ తుప్పు పట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రైతులు చేసిన ఫిర్యాదు మేరకు మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. యడవెల్లి గ్రామానికి చెందిన ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకొని మరమ్మతులు చేపట్టడానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదానికి కారణం ట్రాన్స్‌పార్మర్ తాళ్లసింగారం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌కు చెందినదిగా గుర్తించారు. అందు వలనే విద్యుత్ షాక్‌కు గురైనట్లు అధికారులు ధ్రువీకరించారు. విద్యుదాఘాతానికి గురైన ఆర్టీజన్ కృష్ణను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# డబ్బులు అడిగినందుకు యువకుడిపై కత్తితో దాడి

మిర్యాలగూడ టౌన్ : ఇంటికి వచ్చి డబ్బులు అడిగిన యువకుడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామానికి చెందిన జలేందర్ పట్టణంలోని ఓ ఆటో మెకానిక్ షెడ్‌లో బ్యాటరీ ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నాడు. దీంతో త్రిపురారం మండలం సత్యంపాడు గ్రామానికి చెందిన సంతోష్ అప్పుడప్పుడు ఆటో షెడ్‌కు వచ్చి వెళ్తున్న క్రమంలో జలేందర్‌తో స్నేహం ఏర్పడింది. కాగా, సంతోష్ సెంకడ్ హ్యాండ్ ఆటో కొనుగోలు చేసేందుకు జలేందర్‌ను రూ.30వేలు అడిగాడు. దీంతో జలేందర్ తనకు తెలిసిన ఆటో ఫైనాన్స్ వద్ద డబ్బులు ఇప్పించాడు. అయితే, రెండు, మూడు నెలలుగా కిస్తీ చెల్లించకుండా తిరుగుతుండటంతో జలేందర్ డబ్బుల కోసం సంతోష్ ఇంటికి వెళ్లాడు. తరుచూ ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతుండటంతో కక్ష పెంచుకున్న సంతోష్ డబ్బులు ఇస్తానంటూ రైల్వే స్టేషన్ సమిపానికి రమ్మన్నాడు. దీంతో జలేందర్ అక్కడికి వెళ్లగా ముందుగానే పథకంతో ఉన్న సంతోష్ తనతో తెచ్చుకున్న కూరగాయాలు కోసే కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీంతో జలేందర్ మేడకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. జలేందర్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాధితుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బావిలో మునిగి యువకుడు మృతి


నరేష్ మృతదేహం

వలిగొండ: ఈత కొడుతూ బావిలో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో గోకారంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన పోలేపాక నరేష్(30) స్నేహితుడైన శ్రీకాంత్‌తో కలిసి గోకారం పరిధిలోని నెమలికాలువ రోడ్డు సమీపంలో ఉన్న మద్దెల లక్ష్మయ్య వ్యవసాయ బావిలో మధ్యాహ్నం సమయంలో కొంతసేపు ఈత కొట్టారు. ఈతకొట్టిన తర్వాత శ్రీకాంత్ బావిలో నుంచి పైకి రాగా నరేష్ అందులోనే ఉండిపోయాడు. కొద్దిసేపటి తర్వాత శ్రీకాంత్ గమనిస్తే నరేష్ కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బావిలో మునిగిపోయిన శరేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

### భూమిని ఆక్రమించిన ఇద్దరిపై కేసు

తిరుమలగిరి: భూమిని ఆక్రమించిన ఇద్దరిపై మంగళవారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండల కేంద్రంలోని సర్వే నెం 491లో కొత్తకుంట చెరువులో 0.27 గుంటల చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్, తాడోజు యాదమ్మ ఆక్రమించారు. తహసీల్దార్ రమణారెడ్డి ఇచ్చిన నివేదిక ప్రకారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

# వ్యవసాయ బావిలో వ్యక్తి గల్లంతు


కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి : వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలోని చిన్నతుమ్మలగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మెండి యాదయ్య (55) నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెం గ్రామంలో జరుగుతున్న మల్లన్న పండుగకు కూతురు ఇంటికి వచ్చాడు. సాయంత్రం గ్రామ సమీపంలో గల బావిలో ఈతకొట్టడానికి వెళ్లాడు. బావిలోకి దూకిన యాదయ్య ఎంతకీ బయటికి రాకపోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. రాత్రి వరకు గాలించినా యాదయ్య ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం మేరకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. గజ ఈతగాళ్లను రప్పించి బావిలో గాలించనున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

### లక్ష్మీదేవిగూడెంలో దొంగల హల్‌చల్

- అర్ధరాత్రి మహిళల ఒంటిపై ఆభరణాలు చోరీ

బీబీనగర్: మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో అర్ధరాత్రి దాటాక దొంగలు హల్‌చల్ చేశారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గామానికి చెందిన జిల్కపల్లి అనితతో పాటు కుటుంబ సభ్యులు ఇంటిపైన నిద్రిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన గూడూరు భాను కుటుంబ సభ్యులు కూడా ఇంటి పైనే నిద్రిస్తున్నారు. కాగా అనిత ఇంటిపైకి వచ్చిన ఇద్దరు దుండగులు ఒకరు కింద ఉండగా మరొకరు ఇంటి స్లాబ్ పైకి వెళ్లాడు. నిద్రలో ఉన్న అనిత మెడలో నుంచి 4తులాల పుస్తెలతాడు, ఇతర అభరణాలను తొలగిస్తున్నాడు. ఈ సమయంలో అనిత మేలుకోగా దుండగుడు ఒకే సారి అభరణాలను తెంపుకొని పారిపోవడంతో ఆమె మెడకు గాయాలయ్యాయి. అలాగే 10నిమిషాల వ్యవధిలోనే పక్క వీధిలోని ఇంటిపై నిద్రిస్తున్న గూడూరు భాను మెడలో నుంచి తులంన్నర పుస్తెలతాడును మరో దుండగుడు తెంపుకొని పారిపోయాడు. గ్రామంలోకి వచ్చిన దుండగులు బ్లాక్ టీషర్టులు, పాయింట్లను ధరించినట్లు గ్రామస్తులు తెలిపారు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- నల్లగొండ అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు


అయిటిపాములలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు


తిప్పర్తి : ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

కట్టంగూర్ : ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని నల్లగొండ అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యం వేసిన బస్తాలను వెంటనే ఎగుమతి చేయాలని అధికారులకు సూచించారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

**ధాన్యాన్ని తిరస్కరించొద్దు**

నకిరేకల్ : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని తిరస్కరించకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. నకిరేకల్‌లోని శ్రీ హరికృష్ణ పార్‌బాయిల్డ్ రైస్ మిల్‌ను మంగళవారం ఆయన సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

**కొనుగోళ్లు పూర్తి చేయాలి**

రామగిరి(నల్లగొండ): ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తిప్పర్తి మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు. సెంటర్ నందు సౌకర్యాలను ఆరా తీశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, మండలంలోని వివిధ సెంటర్లలో కొనుగోళ్లు, మిల్లులకు తరలించిన ధాన్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికంగా తరగు తీస్తున్నారని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అక్కడ ఉన్న ధాన్యం నాణ్యతను పరిశీలించారు. ధాన్యం తేమ, నాణ్యతను పరిశీలించి సర్దిపై చేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దారః కృష్ణయ్య, ఏఈఓ సంతోష, సెంటర్ నిర్వాహకులు, రైతులు తదితరులు ఉన్నారు.

# ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- లేదంటే 10 నుంచి 20 శాతం పంట నష్టపోయే ప్రమాదం
- పెద్దవూర వ్యవసాయ అధికారి సందీప్



పెద్దవూర: యాసంగి వరికోతలు పూర్తి కావొచ్చాయి. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాలుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం లేకపోలేదని మండల వ్యవసాయ అధికారి సందీప్ అంటున్నారు. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

ధాన్యం నూర్పిన తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరి కోతలు కోపించేవారు. కూలీలచే వరి పంటను కోసిన తర్వాత వరి పసలను ఆర బెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. కానీ ప్రస్తుతం రైతులు వరి కోత యంత్రాలతో పంట పచ్చగా ఉన్నప్పుడే కోత కోస్తున్నారు. దీంతో ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చేదాక చూసుకోవాల్సి ఉంటుంది. ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.


సందీప్, ఏఓ, పెద్దవూర

పాడి పంట

**నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు**

1. **ముక్క పురుగు:** పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసివేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

2. **వడ్ల చిలుక:** ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తర్వాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

3. **నుసి పురుగు:** దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ. పొడవు ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తర్వాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

**ఎలుకల నివారణకు చర్యలు**

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి.

### ధాన్యం నిల్వ చేసే పద్ధతి..

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెలలో నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.